# ఎక్స్‌లెన్స్‌ఇన్ ఫార్మింగ్ - (ఇండివిడ్యువల్)

రైతుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి.

అన్నదాతలు బతుకు బండి నడిపించలేక కాడి దించేస్తున్నారు.

సమాజం తల దించుకోవాల్సిన పరిస్థితి.

ఇలాంటి దురదృష్టకర పరిస్థితుల మధ్య ఓ ఆశాకిరణం కనిపిస్తోంది.

మెదక్ జిల్లా పాత పంటల సేంద్రీయ వ్యవసాయం కొత్త ఆశగా మారింది.

తక్కువ పెట్టుబడి, నాణ్యమైన పంట ఇదీ లక్ష్యం.

అసలు కాదు కొసరులో కూడా అప్పుకు తావు లేదు.

ఆత్మహత్య అన్న మాటే వినిపించదు.

ఇదీ మహిళా రైతు వినోద గురించి అడిగితే చెబుతారు.

మెదక్ జిల్లా న్యాల్‌కల్ మండలం నాగ్వర్‌కు చెందిన వినోద  30 ఏళ్ల కింద గంగయ్య, పుల్లమ్మ దంపతులకు జన్మించారు. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక అమ్మాయి. ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో వినోద 2002 నుంచి నాగలి చేతబట్టారు. చిరుధాన్యాల సాగులో పట్టు సాధించారు. నూనె గింజలు, పప్పుధాన్యాల్ని పండించడంలో సిద్ధహస్తురాలు. చదువుకున్నది 6 వ తరగతే అయినా.. పంటల పెంపకంలో అపారమైన అవగాహన అందిపుచ్చుకున్నారు. పస్తాపూర్‌లోని స్వచ్ఛంద సేవా సంస్థ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో ముందడుగు వేస్తున్నారు.

వినోదకు మూడెకరాల భూమి ఉంది. ఒక ఎకరం మీద నాలుగు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. మొత్తమ్మీద మూడు ఎకరాల మీద ఆమెకు వస్తున్న సంపాదన రెండు లక్షలు. తన భూమిలో ఎప్పుడూ ఒకే పంట వేయదు వినోద. 20 నుంచి 30 దాకా వేర్వేరు చిరుధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు వేస్తారామె.

తన వ్యవసాయం ద్వారా కుటుంబానికి పోషకాలు అందిస్తూనే ఆర్థికంగా నిలదొక్కుకున్నారు వినోద. విత్తనాలనే తయారు చేసి మార్కెట్‌లో అమ్మడం ద్వారా చేతి నిండా డబ్బు సమకూర్చుకోగలుగుతున్నారు వినోద.

ఇప్పుడు వినోద బాటలో మరికొందరు నడుస్తున్నారు. న్యాల్‌కల్, రాయికోడ్, కోహీర్, ఝరాసంగం మొదలైన మండలాల్లోనూ ఆమె పద్దతులను అనుకరిస్తూ జీవితాలను మెరుగుపరుచుకుంటున్నారు.

నేలతల్లికి మంచి చేస్తే, సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తే ఆకాశమంత ఎత్తుకు ఎదగవచ్చని నిరూపించారు వినోద. భూమిని నమ్ముకున్న వాళ్లు తలెత్తుకు తిరగవచ్చని సాధించి చూపిస్తున్నారు. ఒక మహిళగా ఎంతోమందిలో స్ఫూర్తిని నింపుతున్నారు.